సింగరేణి జాయింట్ వెంచర్‌ను ఒప్పుకోం

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించేందుకు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని, ఈ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. జాయింట్ వెంచర్ అంటే ప్రైవేటీకరణను ప్రోత్సహించడమేనని జేఏసీ నేతలు ఆరోపించారు. జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో జేఏసీ నేతలు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. మూడేండ్లుగా జెన్‌కో లాభాల్లో నడుస్తున్నదని, 2020-21లో రూ. 168 కోట్లు, 2021-22లో రూ.394.46 కోట్లు, 2022-23లో రూ.472.94 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. జెన్‌కో ఈక్విటీతోనే రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వజీర్, మాజీద్, రమేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్పత్తి లక్ష్యం పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి లక్ష్యాన్ని క్రమంగా పెంచుకుంటున్నది. ఇది వరకు రోజుకు రెండు లక్షల బొగ్గును ఉత్పత్తి, రవాణా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ.. తాజాగా దీనిని 2.1 లక్షల టన్నులకు పెంచుకున్నది. బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కంపెనీ సీఎండీ ఎన్ బలరాం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని అన్ని ప్రాంతాల జీఎంలకు ఆయన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలతో కొద్ది రోజుల పాటు సింగరేణిలో ఉత్పత్తి నిలిచిపోగా, వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు.

● నల్లబ్యాడ్జీలతో కేటీపీపీ ఉద్యోగుల నిరసన



థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలను జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించబోమని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్వూరులోని కేటీపీపీలో శనివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. -గణపురం

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- ఇచ్చిన హామీని బుట్టదాఖలు చేస్తున్న కాంగ్రెస్ సర్కారు
- తీవ్ర ఆవేదనలో చేనేత కార్మికులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు మాఫీ చేస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 'చేనేత పాలసీ' అనేది ఏదీ లేదని చేనేత కార్మికులు మండిపడుతున్నారు. చేనేతలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని చేనేత కార్మికసంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, చెరుకు స్వామి విమర్శిస్తున్నారు. మరికొన్ని డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

- చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి.
- చేనేతల కోసం రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్‌ను నెరవేర్చాలి
- త్రిఫ్ట్ ఫండ్, యూరన్ సబ్సిడీ, నేతన్నకు బీమా పథకాలు అమలు చేయాలి
- బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- వస్త్రనిల్వలు వెంటనే కొనుగోలు చేయాలి
- పర్కర్ టూ ఓనర్, జనతా వస్త్ర పథకాలను అమలు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి
- యూరన్ సబ్సిడీ నిధులను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- ప్రతి నేతన్నకు పెట్టుబడిసాయం కింద రూ.5 లక్షలు అందించాలి
- ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలో ఉత్పత్తి చేయించాలి.

హరీశ్ (ఫైల్)

సురేశ్ (ఫైల్)

హేమలత (ఫైల్)

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- మనస్తాపంతో కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగనవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణషాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాండాలో జనగామవాసి హత్య

సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో ప్రాణాలొదిలిన తిరుమలేశ్

తిరుమలేశ్ (ఫైల్)

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : ఉగాండా దేశంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జనగామ వాసి ఇటికాల తిరుమలేశ్ (41) శుక్రవారం అక్కడ హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ ఇటికాల కిష్టయ్య-కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు తిరుమలేశ్ నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 2014 నుంచి ప్రాజెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ కంపెనీకి ఉగాండాలోని నమ్మసాలలో బ్రాంచ్ కార్యాలయం ఉండటంతో 15 నెలల నుంచి భార్య, కుమారుడితో కలిసి తిరుమలేశ్ అక్కడే ఉంటున్నాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు (ఉగాండా కాలమానం ప్రకారం) డ్యూటీకి వెళ్లాడు. అక్కడ కొత్తగా విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డు ఓపియో మద్యం మత్తులో గాల్లోకి కాల్పులు జరుపుతుండగా సహోద్యోగులతో కలిసి తిరుమలేశ్ బయటకు వచ్చాడు. సెక్యూరిటీగార్డు విచక్షణ కోల్పోయి తిరుమలేశ్‌పైకి కాల్పులు జరపగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తిరుమలేశ్ భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో వారిని పరామర్శించారు.

టీ కొట్టు శివకు ఐదు కొలువులు

- పోటీ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం యువకుడి సత్తా
- గత మార్చిలో గురుకుల జేఎల్, పీజీటీ, టీజీటీల్లో ప్రతిభ
- తాజాగా జేఎల్, డీఎస్సీలో విజయ ధంకా

మహేశ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 5: ఓ పేదింటి బిడ్డ.. ప్రభుత్వ కొలువులు కొల్లగొట్టాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొన్నాళ్లు టీకొట్టు నడిపిన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఉడాన్ శివ మహేశ్ కుమార్.. ఆరు నెలల్లోనే ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తాచాటాడు. ధర్మారానికి చెందిన ఉడాన్ సుశీల-లక్ష్మణ్ దంపతులకు శివ మహేశ్ రెండో కొడుకు. ధర్మారంలో చదువుకుంటూనే తల్లిదండ్రులకు సాయపడేవాడు. 2014లో సునీతను వివాహం చేసుకున్నాడు. 2020లో పీజీ పూర్తిచేశాడు. కరోనా టైంలో రాజారాంపల్లిలో టీకొట్టు నడిపాడు. తర్వాత దానిని వదిలేసి తల్లిదండ్రులు, మిత్రుల సహకారంతో 2022లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో గురుకులాల లెక్చరర్, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. అదే ఏడాది ఆగస్టులో పరీక్షలు రాశాడు. గత మార్చిలో ఫలితాలు రాగా.. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ కొలువులకు ఎంపికయ్యాడు. జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకొని ప్రస్తుతం నిర్మల్ జిల్లా మామడలోని గురుకులంలో పనిచేస్తున్నాడు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ పరీక్ష, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు 2024లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు రాసి ప్రతిభ చాటాడు. ఇటీవలే విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ విజయం తన తల్లిదండ్రులకే అంకితమని శివమహేశ్ తెలిపారు.

నిలిచిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల వెరిఫికేషన్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పలు జిల్లాల్లో డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిచిపోయింది. కొన్ని జిల్లాల్లో ఇంకా 1:3 జాబితాలు విడుదల కాలేదు. కోర్టుకేసుల కారణంగా నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. శనివారం వరకు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్, భాషాపండితులు, పీఈటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, స్పెషల్ ఎడ్యుకేషన్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కోర్టుకేసులు లేని జిల్లాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిచేశామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు.

- నల్లగొండలో ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాలేదు. కానీ ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ జాబితాలో 31కి 29 మంది హాజరయ్యారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

సర్వేలో సూచనలు ఇస్తున్న సీఎం కార్యదర్శి

నారాయణపేట, అక్టోబర్ 5 : మెడికల్ కళాశాలకు సంబంధించి లిస్ట్, ఇతర పనులను వెంటనే పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యదర్శి మాణిక్‌రాజ్ ఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో పర్యటించారు. ముందుగా అప్పక్‌పల్లి గ్రామ శివారులో ఉన్న మెడికల్ కళాశాలలో కౌన్సిల్ హాల్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అసోషియేట్ ప్రొఫెసర్‌ల గదులను పరిశీలించారు. హాస్టల్, విద్యార్థులకు భోజన వసతి ఎక్కడ ఏర్పాటు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పేట పట్టణంలో హాస్టల్‌ను ఏర్పాటు చేశామని, కళాశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివరించారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పైలట్ వార్డు అయిన 15వ వార్డులో డిజిటల్ కుటుంబ సర్వేను పరిశీలించి సర్వే చేపడుతున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ సునీతతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జనరల్ దవాఖానను సందర్శించి అవుట్ పేషంట్ ఆన్‌లైన్ నమోదు, ఫార్మసీలో ఔషద నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, డీఎంహెచ్‌వో సౌభాగ్య లక్ష్మి, జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

మహబూబ్‌నగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అరుణ, మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 5: మహబూబ్‌నగర్ న్యూ మోతీనగర్‌లోని కాశీవిశ్వనాథ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అలాగే వాగ్దేవి కళాశాలలో మహిళా అధ్యాపకులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రభాకర్, రుక్మిణి, అఖిల, రాణి, అంజమ్మ, లక్ష్మి, ఝాన్సీ, జాస్మిన్, జ్యోతి, భాగ్యలక్ష్మి, తులసి, వెంకటేశ్వరమ్మ ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో, మధురానగర్‌లోని రెడ్డి హాస్టల్ ఆవరణలో నిర్వహించిన గౌరమ్మ పూజా కార్యక్రమాల్లో ఎంపీ డీకే అరుణ హాజరై బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే సతీమణి ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వాగ్దేవి జూనియర్ కళాశాలలో..

బీచుపల్లిలో యువకుడిని కాపాడిన గంగపుత్రులు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 5 : బీచుపల్లిలో ఓ యువకుడిని గంగపుత్రులు కాపాడిన ఘటన చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా శనివారం మక్తల్ మండలం దండూర్ గ్రామానికి చెందిన కుటుంబసభ్యులు బీచుపల్లి పుణ్యక్షేత్రానికి తలనీలాలు సమర్పించడానికి వచ్చారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల్లో ఒక్కరూ హరి బీచుపల్లి కృష్ణానదిలో ఈత కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీట మునిగాడు. గమనించిన గంగపుత్రులు నదిలో మునిగిపోతున్న హరిని కాపాడి గద్వాల దవాఖానకు తరలించారు. యువకుడిని కాపాడిన శంతన్న, మద్దిలేటి, శం కరన్న, నర్సింహను పలువురు అభినందించారు.

కురుమూర్తి జాతరకు ఘనంగా ఏర్పాట్లు

● నవంబర్ 8న ఉద్దాలోత్సవం ● కలెక్టర్ విజయేందిరబోయి

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి, చిత్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 5 : ఈనెల 31 నుంచి నవంబరు 18 వరకు నిర్వహించనున్న కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నవంబర్ 2న స్వామివారి కల్యాణోత్సవం, నవంబర్ 6న అమ్మాపురం గ్రామం నందు శ్రీ కురుమూర్తి స్వామివారి స్వర్ణాభరణాలకు పూజా కార్యక్రమం, స్వామికి ఆలంకారోత్సవం, నవంబర్ 8న ఉద్దాల ఉత్సవం ఉంటాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం శాఖల వారిగా వసతులు, రవాణా ఏర్పాట్లు, విద్యుత్తు సరఫరా, తాగునీటి సౌకర్యం, వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషన్ ఎస్పీ రాములు, డీఆర్వో కేవీవీ.రవికుమార్, కురుమూర్తి స్వామి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదన్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మాజీ మంత్రి వెంకటస్వామి జయంతి వేడుకలు: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిరబోయి మాజీ మంత్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి దళిత, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఆర్‌డీఓ నర్సిములు, డీఎస్సీ వెంకటేష్, ఐసీడీఎస్ పీడీ జరీనా, బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిర, డీపీఆర్వో శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ అధికారి బాబు, కలెక్టరేట్ ఏవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో మారిన పరిస్థితులు

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 5: ఆర్టీసీలో సమ్మె తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. 2019 సమ్మెలో అమరులైన ఆర్టీసీ కార్మికుల త్యాగాల దినాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల నాయకులు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీలో సమ్మె తర్వాత కార్మికుల పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయని, కార్మికులను పట్టించుకునే నాథుడే లేరన్నారు. 2017 వేతన సవరణ ఎప్పుడు చెల్లిస్తారో స్పష్టత లేదని, విద్యుత్ అద్దె బస్సులు తెచ్చి ఆర్టీసీని మనుగడలేకుండా చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్టీసీ యూనియన్ కార్యక్రమాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డబ్ల్యూయూఎం విజయబాబు, టీజేఎంయూ నాగేందర్, నాగరాజు పాల్గొన్నారు.

ఆలయానికి సామగ్రి వితరణ

మూసాపేట, అక్టోబర్ 5: మండల కేంద్రానికి చెందిన శివమారుతి రామాలయ చైర్మన్ గిన్నె రామచంద్రయ్య, ఆయన సతీమణి కళావతి శనివారం రూ.50వేలు విలువైన సామగ్రిని ఆలయానికి అందజేశారు. అతీ పురాతనమైన శివమారుతి రామాలయంలో తరచూ పూజలు జరుగుతూనే ఉంటాయి. అందుకు వంట పాత్రలు లేక ఇబ్బందులు పడుతుండడంతో ఆలయ కమిటీ సభ్యుల వినతిమేరకు వంట సామగ్రిని వితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను ఆలయం తరపున సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్, ఆంజనేయులు, తిరుపతయ్యగౌడ్, మహేందర్, కొండయ్య, నర్సింహులు, మధు, కృష్ణ, నిశాంత్ గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

జూపార్కు నమూనాతో ఆటాపాట

మరికల్, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ చంద్రకళ జూపార్కు నమూనాను తయారు చేసి చిన్నారులకు జూపార్కులో ఉండే జంతువులను బొమ్మలతో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీచర్ చంద్రకళ మాట్లాడుతూ చిన్నారులకు జంతువుల బొమ్మలతో జూపార్క్ నమూనాను తయారు చేసి వారికి ఆటపాటలతో చదువును నేర్పడంతో గుర్తు పెట్టుకుంటారన్నారు.

ఇద్దరికి గాయాలు

మూసాపేట, అక్టోబర్ 5: మూసాపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం జడ్చర్లకు చెందిన శివ సంకలమద్ది శివారులోని శ్రీకృష్ణ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అతను మరో వ్యక్తి ప్రవీన్‌తోపాటు కలిసి బైక్‌పై శనివారం జడ్చర్ల నుంచి హోటల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యంలో మూసాపేట మలుపు రోడ్డు వద్ద ముందు వెళ్తున్న ఆటో ఆకస్మికంగా బ్రేక్ వేసింది. వెనుక నుంచి వస్తున్న శివ ఆటోను తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ప్రమాంలో శివ, ప్రవీన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108లో జిల్లా దవాఖానకు తరలించారు.

గడ్డం సేవలు చిరస్మరణీయం

నారాయణపేట టౌన్, అక్టోబర్ 5 : స్వర్గీయ గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం వెంకటస్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఆలయ శిఖర నిర్మాణానికి భూమి పూజ

ధన్వాడ, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ శిఖర నిర్మాణానికి శనివారం హైకోర్టు న్యాయవాది, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10లక్షల వ్యయంతో నూతనంగా వేంకటేశ్వర స్వామి శిఖర నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు వీరభద్రప్ప, రాంచంద్రయ్య, ఉమేశ్‌కుమార్, సుధీర్‌కుమార్ రావు, మాధవరెడ్డి, నర్సింహులు శెట్టి, సత్యానారాయణ గౌడ్, రాఘవారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చింతకుంట ఎస్సైకి అధికారుల అభినందన

జడ్జి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న సీసీకుంట ఎస్సై శేఖర్

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 5: చిన్నచింతకుంట ఎస్సై శేఖర్ జిల్లా అధికారుల నుంచి అభినందనలు అందుకున్నాడు. ఇటీవల జరిగిన లోక్‌అదాలత్‌లో చిన్న చింతకుంట పోలీస్‌స్టేషన్ నుంచి ఎక్కువ కేసులు రాజీ చేయడాని కృషి చేసిన సీసీకుంట ఎస్సై, కోర్టు కానిస్టేబుల్ శివకుమార్‌ను జిల్లా జడ్జి పాపిరెడ్డి అభినందించి అప్రిషియేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జోనల్ లెవల్ డ్యూటీ మీట్‌లో ఫింగర్ ప్రింట్స్, క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ విభాగంలో ఎస్సై శేఖర్ రెండు మెడల్స్ సాధించారు.

వాహనాలకు పత్రాలు ఉండాలి

వాహనపత్రాలు తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట, అక్టోబర్ 5 : వాహనదారులు వాహనానికి సంబంధించి అన్ని ధ్రువ పత్రాలు ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని వీరసావర్కర్ చౌరస్తా, ఎర్రగుట్ట వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడి పే వ్యక్తి హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఎస్సై గాయత్రి, ఏఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

వనపర్తి టౌన్, అక్టోబర్ 5: వనపర్తి ఆర్టీసీ డిపోలో ప్రాణాలర్పించిన అమరవీరుల చిత్రపటాలకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎం కృష్ణయ్య అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ బస్సులను సంస్థనే కొనుగోలు చేసి నియామకాలు చేపట్టాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, 173 నెలల డీఏ ఏరియల్స్ ఇవ్వాలని, ఆర్టీసీ సంఘాల నిషేదాలను ఎత్తివేయాలని వారు కోరారు. కార్య